ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- 22 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు
- ఆత్మీయ సమ్మేళనంలో సంబురాలు


సమావేశమైన 1999-2002 కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులు

భిక్కనూరు : ఐదేళ్లు కాదు..పదేళ్లు కాదు.. 22ఏళ్ల తర్వాత కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులు భిక్కనూరు మండలం బీటీఎస్ చౌరస్తాలోని ఇంద్రప్రస్థ రిసార్ట్స్‌లో ఆదివారం సమావేశమయ్యారు. 62మంది విద్యార్థులకు గాను 51 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి తీపి గుర్తులను గుర్తు చేసుకుని సంతోషపడ్డారు. తమ బ్యాచ్ విద్యార్థులందరూ వివిధ స్థాయిల్లో ఉండడం చూసి సంబురపడ్డారు. అప్పటిఇప్పటి చదువులు గురించి తమ పిల్లల విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది తమ కుటుంబీకులతో కలిసి పెద్దఎత్తున ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవాలని నిర్ణయించుకున్నారు.

రెండు దశాబ్దాల తర్వాత..


కాలేజీ వదిలిన తర్వాత రెండు దశాబ్దాల తర్వాత మా క్లాస్‌మేట్స్‌ని కలవడం సంతోషంగా ఉంది. 22ఏళ్ల తర్వాత మేమందరం ఒకరి గురించి ఒకరం తెలుసుకునే అవకాశం మాకు లభించింది.

– ప్రమోదా దేవి, ప్రిన్సిపాల్ మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాల, కామారెడ్డి

అందరూ ఒకే వేదికపై..


కళాశాలను వదిలి ఉద్యోగాల్లో వ్యాపారాల్లో స్థిరపడ్డ తర్వాత ఒకే వేదికపై అందరం కలుసుకోవడం ఎంతో ఉల్లాసానిచ్చింది. ఈ రోజు కోసం నెల రోజులుగా ఎదురు చూశాను. ఈ రోజు అందరం స్నేహితులం కలుసుకోవడం ఆనందంగా ఉంది.

– నరేశ్, కానిస్టేబుల్

స్నేహితుల కోసం వచ్చా..


వ్యక్తిగత పనులుప్పటికి స్నేహితులను కలిసేందుకు వచ్చాను. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నేహితులతో గడిపాను. సమయం ఎట్లా గడిచిందో అర్థం కాలేదు. ఈ సమ్మేళనం ఎంతగానో తృప్తినిచ్చింది.

– ఇప్పకాయల రమేశ్, చార్టెడ్ అకౌంటెంట్

నెల నుంచి ఎదురు చూశా..


నెలరోజుల క్రితం సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బ్యాచ్‌మెట్లు ఫోన్‌లో సమాచారం అందించారు. అప్పటి నుంచి ఈరోజు కోసం ఎదురుచూశాను. 22ఏళ్ల తర్వాత క్లాస్‌మెట్లను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

– శ్రీలత, కపిల్ చిట్స్ మేనేజర్, హైదరాబాద్

వచ్చే ఏడాది కుటుంబీకులతో..


ఈ ఏడాది క్లాస్‌మెట్స్ అందరం కలుసుకున్నాం. తామందరం వచ్చే ఏడాది కుటుంబీకులతో కల్సి సంబురాలు జరుపుకుంటాం. రెండు దశాబ్దాల తర్వాత క్లాస్‌మెట్స్ అందరం ఒకే చోట కల్సుకున్నందుకు చాలా సంతోషం కలిగింది.

– నాగేశ్వర్‌రావు, సినిమా దర్శకుడు

ఎంతో సంతృప్తినిచ్చింది..


మా క్లాస్‌మెట్స్ అందరం ఈ సమ్మేళంలో పాల్గొనడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఆనాటి ముచ్చట్లను గుర్తుచేసుకుని ఉల్లసంగా గడిపాం. మరిచిపోని రోజుగా ఈ రోజు గుర్తుండిపోతుంది.

– మమత, సీనియర్ అసిస్టెంట్, కామారెడ్డి కోర్టు

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం


మర్కల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాగయ్య తదితరులు

- నియోజకవర్గ అభివృద్ధికి రూ. 120 కోట్లు
- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని మర్కల్ గ్రామంలో సీసీ రోడ్డు, మురికి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న గ్రామాల అభివృద్ధి కోసం రూ. 120 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా మర్కల్‌లో సీసీరోడ్ల నిర్మాణం, మురికి కాలువ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జూకంటి సంగారెడ్డి, జైగౌడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సంపత్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, నాయకులు బత్తుల రాములు, రాజు, లింగం, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించండి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు వినతి పత్రం అందజేశారు. పాఠశాల చుట్టు ప్రహరీ, బాల, బాలికలకు మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, తదితర నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రాజన్న, మండల కేంద్రంకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ముందంజ'


మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ శంకర్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్ : 'సమాజానికి ఆదర్శంగా నిలవాలి' అనే నినాదంతో రోటరీ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా రోటరీ క్లబ్ సేవ చేస్తోందని రోటరీ డిస్ట్రిక్ (ఉమ్మడి రాష్ట్ర) గవర్నర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి రోటరీ క్లబ్ ఏడు నెలలుగా నిర్వహించిన 45 సామాజిక సేవా కార్యక్రమాలను రోటరీ గవర్నర్ ఆదివారం అధికారిక తనిఖీ చేసిన అనంతరం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సేవాకార్యక్రమాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రయోజనం కల్గించే కార్యక్రమాలు చేశారని కామారెడ్డి రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యం, పి.రాజనర్సింహరెడ్డి, కోశాధికారి టి.సుధాకర్‌ను అభినందించారు. పేదలకు ఉపయోగపడే ఏదైనా ప్రాజెక్టును చేపట్టడానికి కామారెడ్డి రోటరీ క్లబ్ 33 శాతం వ్యయం భరిస్తే రూ. 25 లక్షల గ్లోబల్ గ్రాంట్ మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ హరిశంకర్, ప్రతినిధులు డాక్టర్ విజయ్‌కుమార్, శ్రీశైలం, బి.నాగభూషణం, ధనుంజయ తదితరులున్నారు.

శివ మండల దీక్షలు ప్రారంభం


యజ్ఞం చేస్తున్న భక్తులు

కామారెడ్డి రూరల్ : శివరాత్రిని పురస్కరించుకుని చేపట్టే పవిత్రమైన శివ మండల దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు శివమండలదీక్షలు చేపట్టారు. పట్టణ పరిధిలోని దేవునిపల్లి శివాలయంలో శివస్వాములకు శివభక్త కమిటీ ఆధ్వర్యంలో భిక్షను ఏర్పాటు చేశారు. ఆలయంలో అర్చకులు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం అర్చకులు భక్తిపై పలు ప్రవచనాలు చేశారు. మహాయజ్ఞం నిర్వహించారు. ఆలయ కమిటీ మహారాజ పోషకులు చిన్నోల్ల గోపాల్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ శివస్వాములకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శివభిక్ష కమిటీ అధ్యక్షుడు నిట్టు నారాయణరావు, ప్రతినిధులు సాయాగౌడ్, లక్ష్మీపతియాదవ్, పాతరాజు, గూడెల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

పొట్ట కూటి కోసం..


మద్నూర్‌లో విన్యాసాలు చేస్తున్న బాలిక

మద్నూర్(జుక్కల్) : కూటికోసం వలస జీవులు కోటి తిప్పలు పడాల్సిందే. కడుపు లో నాలుగు మెతుకులు పడాలంటే కష్టపడక తప్పని పరిస్థితి. మండల కేంద్రంలో ఆదివారం వలస జీవులు పాత బస్టాండ్ కూడలిలో సర్కస్ ఏర్పాటు చేశారు. అందులో చిన్నపిల్లలు తాగుపై అవలీలగా నడుస్తూ పలు రకాల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

ముగిసిన క్రికెట్ టోర్నీ


కామారెడ్డి అర్బన్ :కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి మాజీ సర్పంచ్ లద్దూరి శివాజీగణేశ్ స్మారక క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. గణతంత్ర దినోత్సవం రోజు ప్రారంభమైన క్రికెట్ పోటీల్లో విన్నర్‌గా దేవునిపల్లి స్టార్స్ టీమ్ నిలిచి రూ. 10వేల నగదు, ట్రోఫీని అందుకుంది. రన్నర్‌గా దేవునిపల్లి లెజెండ్స్ టీం నిలిచింది. ముగింపు కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి ఎల్ లక్ష్మీపతి యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నీలం చిన్నరాజులు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఉర్దొండ నరేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల రవీందర్, కౌన్సిలర్ పి కృష్ణాజీరావు పాల్గొన్నారు.

కామారెడ్డి రక్తదాతలకు పురస్కారం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి రక్తదాతల సమూహం మిర్యాలగూడ జనమైత్రి ఫౌండేషన్ ఉత్తమ సామాజిక పురస్కారాన్ని అందుకుంది. ఆదివారం మిర్యాలగూడలో నిర్వహించిన కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు జనమైత్రి ఫౌండేషన్ పురస్కారం అందుకున్నారు. ఈ సమూహం ఇప్పటిదాకా 18వేల యూనిట్ల రక్తదానం చేసిందని ఆయన పేర్కొన్నారు. కామారెడ్డి రక్తదాతలు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు జమీల్ అహ్మద్, డాక్టర్ పుట్ట అనిల్, కిరణ్ కుమార్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఐకేపీ వీవోఏలకు జీతాలు చెల్లించాలి


సమావేశంలో పాల్గొన్న మహిళా ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్ : ఐకేపీ వీవోఏలందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ప్రతినెలా సక్రమంగా జీతాలు చెల్లించాలని వీవోఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పఠాన్ గౌస్‌ఖాన్ డిమాండ్ చేశారు. కామారెడ్డి ఇందిరా గాంధీ స్టేడియంలోఆదివారం ఐకేపీ వీవోఏల జిల్లా సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోత్ శివరాం నాయక్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. వచ్చేవారం మరో జిల్లా సమావేశం నిర్వహించి సమస్యలపై విధాన నిర్ణయాలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. సమావేశంలో సంఘం వర్కింగ్ అధ్యక్షుడు జి.విక్రంగుప్తా, ఆయా మండలాల ప్రతినిధులు కే.షోచన్న, జే.మల్లేష్, శివకుమార్, పద్మక్క, బి.రాములు, నరేష్‌యాదవ్, లక్ష్మీదేవి, మార్తండ రవి, వీరప్ప, జమున తదితరులున్నారు.

వంద రోజుల్లో హామీలన్నీ నెరవేర్చాలి


కామారెడ్డి టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లోపే అమలు చేయాలని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు వీఎల్ నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి దశరత్ తదితరులున్నారు.

దేశవ్యాప్త సమ్మెను సక్సెస్ చేయాలి


మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్

మద్నూర్(జుక్కల్) : వచ్చేనెల 16న జరిగే అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల దేశవ్యాప్త సమ్మెను సక్సెస్ చేయాలని సీఐటీయూ కన్వీనర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని మేనూర్‌లో ఆదివారం మద్నూర్, డోంగ్లీ రెండు మండలాలకు చెందిన అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్‌గొండ, అనసూయ, సచిత, సుజాత, ప్రేమల, శారద, సరస్వతి, సుమన్‌బాయి, శాంతి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జీపీలకు ప్రత్యేక అధికారులు

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని గ్రామ పంచాయతి పాలక వర్గం పదవి కాలం 31తో ముగియనుండడంతో ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. పైఅధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల నియామకం కోసం జిల్లా అధికారులకు నివేదిక పంపించామన్నారు. రెవెన్యూ పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, ఐకేపీ, ఐసీడీఎస్, వ్యవసాయ ఆయా శాఖల అధికారుల పేర్లు పంపించామన్నారు. ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. గ్రామ పంచాయతి ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారులుంటారన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి


పిట్లం(జుక్కల్): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని గోపాల్ గోవింద్ శాస్త్రి రాందాస్ మూలే జుక్కల్ మఠం శ్రీ కేశవ్ మహారాజ్ పేర్కొన్నారు. ఆయన ప్రతి ఏడాది లాగే మఠంలో అన్నదానం కోసం ఆదివారం మండల కేంద్రమైన పిట్లంలో ఇంటింటికీ తిరుగుతూ ధర్మభిక్షాటన చేశారు. శ్రీ కేశవ్ మహారాజ్ కాళ్లను కడిగి వారి ఆశీస్సులు తీసుకొని బియ్యంను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ శఫ్దం రెడ్డి, బీజేపీ పార్టీ కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, గ్రామ పెద్దలు, భక్త బృందం పాల్గొన్నారు.

స్నేహితుల సంక్షేమ సంఘం ఏర్పాటు

మాచారెడ్డి : మండలంలోని గజ్యా నాయక్ తండా చౌరస్తాలో ఆదివారం సదార్ నాయక్ నేతృత్వంలో స్నేహితుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా శంకర్, ఉపాధ్యక్షుడిగా రామచంద్రం, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమేష్, కార్యదర్శిగా స్వామి, కోఆర్డినేటర్‌గా తిరుపతి, కార్యదర్శులుగా రాజు, రవీందర్, సలహాదారులుగా రాజు, రవి, తిరుపతిని ఎన్నుకున్నారు.



మల్కాపూర్‌లో జీపీ భవనం ప్రారంభం


ఎల్లారెడ్డి : మండలంలోని మల్కాపూర్‌లో నూతనంగా నిర్మించిన జీపీ భవనాన్ని ఎంపీపీ మాధవి ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన జీపీని ఎంపీపీ, జెడ్పీటీసీ ఉషాగౌడ్‌లతో కలిసి భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హేమలత, వైస్ ఎంపీపీ నర్సింలు, డీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేను కలిసిన మేరు సంఘం నాయకులు


బాన్సువాడ : బాన్సువాడలో ఆదివారం మేరు సంఘం కులస్తులు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిని కలిశారు. మేరు కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దర్జీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నామని, మేరు కులస్తుల కోసం వ్యక్తిగత రుణాలు ఇప్పించేలా కృషి చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో మేరు కులస్తులు హన్మాండ్లు, భాస్కర్, వెంకట్, సురేష్, అంబికా సురేష్, వీరేందర్, శంకర్, మహేష్ తదితరులు ఉన్నారు.

శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డికి సన్మానం


లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ఐలాపూర్‌కు చెందిన ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు ఆదివారం శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డిని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఐలాపూర్‌లో శివాజీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు సహకరించాలని యూత్ సభ్యులు కోరారు. దాంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.కార్యక్రమంలో యూత్ సభ్యులు రజినీకాంత్ గౌడ్, సతీష్‌రెడ్డి, సంపత్‌గౌడ్, ముకుంద్‌రెడ్డి, సతీష్, శ్రీనివాస్‌గౌడ్, రాముగౌడ్, భాస్కర్‌గౌడ్, శివలింగంగౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత


తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలోని దేమికలాన్ గ్రామానికి చెందిన బాధిత కటుంబానికి ఎల్‌వోసీని ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అందజేశారు. మండలంలోని దేమికలాన్ గ్రామానికి చెందిన చాకలి రాజశేఖర్ అనే వ్యక్తి బతుకు దెరువు కోసం విదేశానికి వెళ్లి తీవ్ర అనారోగ్యంతో తిరిగి వచ్చాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా రూ.5 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కమ్మరి రాజు, చిన్న సాయిలు, కందడి లింగారెడ్డి, నర్సయ్య, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు


తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ శివారులో ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కలిశారు. మదన్‌మోహన్ ఎల్లారెడ్డి పట్టణం నుంచి కామారెడ్డి వైపు వెళ్తుండగా మార్గమధ్యలో ఎర్రాపహాడ్‌లో కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో కాన్వాయ్‌ని ఆపి మర్యాదపూర్వకంగా కలిశారు. సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, కాశిరెడ్డి, తదిరులు కలిసిన వారిలో ఉన్నారు.

పండరీపూర్ యాత్ర కరపత్రాల ఆవిష్కరణ


బాన్సువాడ : వచ్చేనెల 5వ తేదీ నుంచి 21 వరకు జరిగే పండరీపూర్ పాదయాత్ర కరపత్రాలను ఆదివారం బీర్కూర్ రామాలయంలో ఆవిష్కరించారు. వచ్చేనెల 5న బైరాపూర్ రుక్మిణి విఠలేశ్వర మందిరం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని బైరాపూర్ పీరాజీ తెలిపారు. 5న ప్రారంభమయ్యే పాదయాత్ర 21వ తేదీన పండరీపూర్ పుణ్యక్షేత్రానికి చేరుకుంటుందన్నారు.

నేడు కామారెడ్డి మండల సర్వసభ్య సమావేశం

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29న ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అధ్యక్షతన కామారెడ్డి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయాశాఖల అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సంక్షిప్తం

వైద్యశాఖలో నర్సింగ్ ఆఫీసర్‌గా అశ్విన్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లికి చెందిన నాగం అశ్విన్‌కుమార్ వైద్యశాఖలో నర్సింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం ప్రకటించిన నర్సింగ్ ఫలితాల్లో దేవునిపల్లికి చెందిన అశ్విన్‌కుమార్ నర్సింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా అశ్విన్‌ను తల్లి తండ్రులు విజయలక్ష్మి, శ్యాంసుందర్ అభినందించారు.

ఎల్లారెడ్డి ఎస్సైగా బొజ్జ మహేశ్

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ఎస్సైగా బొజ్జ మహేశ్ బదిలీపై వచ్చినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. రాజన్న సిరిసిల్లా జిల్లాలో డీఎస్‌బీలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మహేశ్ ఎల్లారెడ్డికి బదిలీ అయినట్లు వారు తెలిపారు. ఎల్లారెడ్డి ఎస్సైగా విధులను నిర్వర్తిస్తున్న గణేశ్‌కు త్వరలోనే బదిలీకి సంబంధించిన ఉత్తర్వులు రానున్నట్లు వారు తెలిపారు.

లింగంపేట ఎస్సైగా చైతన్యకుమార్ రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట నూతన ఎస్సైగా గోలి చైతన్య కుమార్‌రెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ నుంచి బదిలీపై లింగంపేటకు వస్తున్నట్లు సమాచారం. లింగంపేటలో పనిచేసిన ఎస్సై ప్రభాకర్ బదిలీ అయ్యారు.

శాఖాగ్రంథాలయానికి బిల్లులు చెల్లించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయానికి జీపీల నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించాలని గ్రంథపాలకుడు రాజలింగం కోరుతున్నారు. తాడ్వాయి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలు ఇళ్ల వినియోగదారుల నుంచి వసూలు చేసిన ఇళ్ల బిల్లుల నుంచి 8 శాతం గ్రాంట్‌ను గ్రంథాలయానికి చెలించాల్సి ఉంటుందన్నారు. 18 జీపీలకు గాను గ్రంథాలయానికి సుమారు రూ. 5 లక్షలకు పైగా బకాయిలు రావాల్సి ఉందన్నారు.

రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

రాజంపేట : రాజంపేట మండలం ఆర్గొండ సొసైటీ పరిధిలోని రైతులు సహకార సంఘంలో స్వల్పకాలిక రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సొసైటీ చైర్మన్ కందిశివరాములు ఆదివారం ప్రకటనలో తెలిపారు. రుణాల పునరుద్ధరణ కోసం రైతులు పట్టదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, సహకార బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్, ఫోన్ నంబర్‌తో సొసైటీ ఆఫీస్‌లో సీఈవో సాయిలను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు..

భిక్కనూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భిక్కనూరు దుర్గా నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన జట్టుకు క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గానవరాత్రి ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నరసింహుడి ఆలయంలో కుంకుమ పూజలు

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే పుట్టు ఒల్లెలు, పంచెలు, వాహన పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, అర్చకులు శ్రీనివాస చార్యులు, నరసింహ చార్యులు, పరందామా చార్యులు, సంజీవ చార్యులు ఉన్నారు.